శిక్షణోత్సాహం.. పతకమే లక్ష్యం..

- కాకినాడలో రాష్ట్రస్థాయి హాకీ శిక్షణ శిబిరం
- ముమ్మరంగా సాధన చేస్తున్న క్రీడాకారిణులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఉన్న హాకీ కోర్టులో రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం ఉత్సాహంగా జరుగుతోంది. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఆటలోని మెళకువలు, టెక్నిక్‌లు తెలుసుకుంటూ జోరుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. రాష్ట్ర హాకీ సంఘం సహకారంతో జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

ఈ నెల 22న ప్రారంభం

హాకీ శిక్షణా శిబిరం ఈ నెల 22న తేదీన ప్రారంభమైంది. ఈ నెల 28వ తేదీ వరకూ కొనసాగనుంది. ధర్మవరానికి చెందిన కోచ్ హసీన్, కాకినాడ జిల్లా కోచ్ రవిరాజు పర్యవేక్షణలో ఈ శిబిరంలో 16 మంది క్రీడాకారిణులు హాకీలో మెళకువలు నేర్చుకుంటున్నారు. షూటింగ్, కాంబినేషన్ టెక్నిక్స్‌లో వీరికి శిక్షణ ఇస్తూ, స్థానిక క్రీడాకారులతో కలిసి మ్యాచ్‌లు ఆడిస్తున్నారు. వీరందరికీ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వసతి కల్పించారు. రాష్ట్ర సంఘం సహకారంతో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

30 నుంచి జాతీయ పోటీలు

జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 10 వరకూ జాతీయ స్థాయి హాకీ పోటీలు నిర్వహించనున్నారు. కాకినాడ శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆ పోటీల్లో రాష్ట్రం తరపున తలపడతారు. కోచ్ రవిరాజు మాట్లాడుతూ ఈ నెల 28 వరకు జరిగే శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాంచీలో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.



కాకినాడలోని హాకీ కోర్టులో శిక్షణ పొందుతున్న క్రీడాకారిణులు

ఇండియాకు ఆడతాను



ఇప్పటి వరకూ 11 నేషనల్స్‌లో పాల్గొన్నాను. 2015లో కడప సౌత్ జోన్‌లో బంగారు పతకం సాధించాను. మా మామయ్య హాకీ ప్లేయర్. అందుకే నేను కూడా హాకీ క్రీడాకారిణి అయ్యాను. టీం ఇండియాకు ఆడడమే నా లక్ష్యం.

– లలిత, అనకాపల్లి జిల్లా

ఉన్నతస్థాయికి చేరడమే లక్ష్యం



కడప స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతిలో చేరాను. జిమ్నాస్టిక్స్, హాకీ ఆడతాను. ఇప్పటి వరకు 11 నేషనల్స్‌లో ఆడాను. అంకితభావం, పట్టుదల ఉంటే ఏ ఆటలోనైనా రాణించవచ్చు. హాకీలో ఉన్నత స్థాయికి చేరడమే లక్ష్యం.

– టి.యువరాణి, చిత్తూరు జిల్లా

మూడోసారి నేషనల్స్‌కు..



కాకినాడ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి శిక్షణకు ఎంపికయ్యాను. మూడోసారి నేషనల్స్‌కు అర్హత సాధించాను. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాను. ఇండియాకు ఆడడం అనేది నా కల.

– భాగ్యశ్రీ, కాకినాడ జిల్లా

శిక్షణ బాగుంది



ముంబై నేషనల్స్ స్పోర్ట్స్ అకాడమీలో హాకీ శిక్షణ పొందుతున్నాను. నాలుగోసారి నేషనల్స్‌కు అర్హత సాధించాను. ఇక్కడ శిక్షణ బాగుంది. జాతీయస్థాయిలో పతకం సాధించడమే నా లక్ష్యం. అందుకు పట్టుదలతో సాధన చేస్తున్నాను.

– బి.అంకిత, కడప

డీసీపీ హరిదాస్ బదిలీ

- విశాఖ ఇన్‌చార్జి డీసీపీగా నియామకం
- పలువురు డీఈ, ఏఈలు కూడా..



డీసీపీ హరిదాస్

కాకినాడ: నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్ బదిలీ అయ్యారు. ఆయనను విశాఖ ఇన్‌చార్జి డీసీపీగా బదిలీ చేస్తూ పురపరిపాలన శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రెండున్నరేళ్లుగా ఆయన ఇక్కడ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం నుంచి వరహాలబాబు డీసీపీగా బదిలీపై వచ్చారు. కాగా కాకినాడ నగరపాలక సంస్థలో డీఈలుగా పనిచేస్తున్న ప్రభాకరరావు, కె.లోవరాజు, కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో డీఈలుగా ఫణీంద్రకుమార్, గురునాథబాబు, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ కొత్తగా నియమితులయ్యారు. కాగా ఇక్కడ ఏఈలుగా పనిచేస్తున్న ఉమామహేశ్వరి, వై.నాగేశ్వరరావు, ఎం.రమేష్ బాబు, పి.సూర్యకుమారి, ఎస్.సాంబశివరావు వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వీరి స్థానంలో కొత్తగా ఏఈలుగా లలితకుమారి, శేషుకుమారి నియమితులయ్యారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న భీమశంకర్

కాకినాడ క్రైం: పోలీసులు ధూమపానానికి దూరంగా ఉండాలని ప్రముఖ పల్మనాలజీ నిపుణుడు డాక్టర్ భీమశంకర్ హితవు పలికారు. బుధవారం ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది కోసం ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భీమశంకర్ మాట్లాడుతూ, ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించిన ముందస్తు సంకేతాలను విస్మరించడం ద్వారా ముప్పు వాటిల్లుతుందన్నారు. ధూమపానం చేసే వారితో పాటు, పక్కనున్న వారికీ ప్రమాదమేనని తెలిపారు. నిత్యం వైద్య పరీక్షల ద్వారా ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణకుమారి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన ఎం కృష్ణకుమారి బుధవారం కలెక్టర్ షణ్మోహన్ సగిలిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే సాధారణ బదిలీల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలంలో పనిచేసి, కాకినాడ డీఆర్‌ఓ కార్యాలయంలో ప్రత్యేక తహసీల్దార్‌గా నియమితులైన జీఆర్ ఠాగూరు కూడా కలెక్టర్‌ను కలుసుకుని మొక్కను అందించారు.

క్లుప్తంగా

ఐడియల్ లెక్చరర్ మాధవికి డాక్టరేట్



ఎస్‌వీఎస్ గౌరీ మాధవి

బాలాజీ చెరువు: ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకురాలు ఎస్‌వీఎస్ గౌరీ మాధవికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. థీమ్ ఆఫ్ హ్యూమనిజం ఇన్ ద సెలెక్టెడ్ నవల్స్ ఆఫ్ జార్జ్ ఎలైట్ ఎ స్టడీ అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసం రచించారు. దాన్ని ఏయూ ప్రొఫెసర్ పి.రాజేంద్ర కర్మాకర్ పర్యవేక్షణలో సమర్పించారు. డాక్టరేట్ పొందిన గౌరీ మాధవిని కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, ఏఓ జీవీకే వర్మ, హెడ్ కె.శ్రీహరివర్మ అభినందించారు.

కబడ్డీ అండర్-14లో విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించిన కబడ్డీ అండర్-14 మండల స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని గీతం పాఠశాల కరస్పాండెంట్ సుజ్ఞాన్ బుధవారం తెలిపారు. విద్యార్థులు వెంకట్‌వినయ్, గిరీష్, జశ్వంత్ (తొమ్మిదో తరగతి) విశేష ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సురభి శారద, పీఈటీ ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

27న కాకినాడలో డిపాజిటర్ల సమావేశం

పిఠాపురం: జయలక్ష్మి బ్యాంకు బాధితులైన డిపాజిటర్లందరికీ వారి సొమ్ము వాపసు చేసేలా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లామని బ్యాంకు బాధిత డిపాజిటర్ల సంఘం పిఠాపురం కన్వీనర్ యనమండ్ర సూర్యనారాయణ తెలిపారు. పిఠాపురం స్టువర్టుపేటలోని తన నివాసంలో సుబ్రహ్మణ్యం మాస్టర్‌తో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. జయలక్ష్మి ఎంఏఎం కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు డిపాజిటర్లంతా 27వ తేదీన కాకినాడలో జరిగే మూడో వార్షిక సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

కోనేరు పార్కును అభివృద్ధి చేయాలి



నాగ శివలింగం అదృశ్యమైన ప్రాంతాన్ని చూపుతున్న దూసర్లపూడి

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ కోనేరు పార్కును ఆధ్యాత్మిక పార్కుగా అభివృద్ధి చేయాలని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో పార్కు అధ్వానంగా ఉన్న విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, పార్కు ప్రక్షాళన చేయడంపై ఆయన బుధవారం హర్షం వక్తం చేశారు. ఆలయ కోనేరుపై 2013లో ఇక్కడ ప్రతిష్ఠించిన నాగ శివలింగం అదృశ్యమైనా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. కోనేరు గట్టుపై అమ్మవారి ఆరు శక్తి స్వరూపాల శిలా విగ్రహాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దేవదాయ శాఖ అధికారులు స్పందించి, పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.

పంచారామంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ భళ్ల నీలకంఠం సూచనలతో చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయంలో ఉన్న ఉపాలయాల్లోను పూజలు జరిగాయి.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్	:	చాక్లెట్ 35, సరిపోదా శనివారం, హైడ్ ఎన్ సీక్, మత్తు వదలరా 2
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్	:	గొర్రె పురాణం, 35, సరిపోదా శనివారం, 100 కోట్లు
లక్ష్మి	:	ట్రాన్స్‌ఫార్మర్స్
సత్యగౌరి	:	గొర్రె పురాణం
తిరుమల	:	చాక్లెట్
సీఅండ్‌సీ1	:	మత్తు వదలరా 2
సీఅండ్‌సీ2	:	బొమ్మరిల్లు
శ్రీప్రియ	:	ఆయ్
పద్మప్రియ	:	సరిపోదా శనివారం
సూర్య (వాకలపూడి)	:	గొర్రె పురాణం
సూర్య2	:	సరిపోదా శనివారం

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి



పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని స్థానిక రమణయ్యపేటలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పార్టీ కాకినాడ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న జన్మించారని, ఆర్‌ఎస్‌ఎస్‌లో కీలక భూమిక పోషించారన్నారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951లో స్థాపించిన జన సంఘ్ పార్టీలోకి తీసుకున్నారన్నారు. భారతీయ జన సంఘ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా పని చేశారన చెప్పారు. జాతీయ భావం, మానవీయత, ఉన్నత ప్రమాణాలకు మార్గదర్శనం చేసిన ఆయన 1968 ఫిబ్రవరి 11 వారణాసి మొఘల్ సరాయ్ స్టేషన్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ, అట్టడుగు స్థాయి వారి వరకు ప్రభుత్వ పథకాలు అందాలనే ఆలోచనను ఆనాడే పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పితాని లీలావతి, పుట్టా గాంధీ, గౌతు చిన్నారావు, బల్ల సుధాకర్, కవి కొండల చలపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో ఫార్మసిస్టులు కీలకం



ఫార్మసిస్టులను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: ఆరోగ్యానికి సంబంధించిన వైద్య వృత్తులలో ఫార్మసీ కూడా ఎంతో కీలకమని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఫార్మసీ విభాగ అధికారి బి.హర్షవర్ధన వర్మ అన్నారు. వైద్యులు వ్యాధి నిర్ధారణ చేస్తే, దానికి తగ్గట్లుగా ఫార్మసిస్టులు రోగులకు మందులు అందించి కాపాడతారని చెప్పారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ జీవితంలో అంతర్భాగమన్నారు. ఔషధ మోతాదు, దాని ఉపయోగం వంటి అంశాలను రోగులకు వివరిస్తూ, వారు సురక్షితంగా, ఆరోగ్యంగా జీవించేలా చేయడంలో ఫార్మసిస్టులు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. సరైన మోతాదులో మందులు తీసుకునేలా మార్గనిర్దేశం చేయడం కోసం ప్రతి ఏటా సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవంగా జరుపుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఫార్మసీ ముఖ్య అధికారి ఎస్.ప్రభుదాస్ మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులు ముఖ్యపాత్ర పోషిస్తారని, వారు లేకుండా వైద్య పరిశ్రమ ఉనికిలో ఉండదన్నారు. ఫార్మసిస్టు శ్రీవాణి మాట్లాడుతూ, ఔషధాలపై ప్రజలకు బోధించడం, సురక్షితమైన వినియోగం, వైద్య సమస్యలపై అవగాహనను ప్రోత్సహించడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధి అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఫార్మసిస్టులు బి.హర్షవర్ధన్‌వర్మ, ఎస్. ప్రభుదాస్, పి.శ్రీవాణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా, కేవీ రాఘవరావు, కె.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బయోమెథనేషన్ ప్లాంట్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

– కార్పొరేషన్ కమిషనర్ భావన వెల్లడి

కాకినాడ: తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బయో మెథనేషన్‌ప్లాంట్‌ను కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. బుధవారం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎనర్గాన్‌లాజిస్టిక్స్ రూపొందించిన ప్రాజెక్టు ప్రజెంటేషన్‌ను కమిషనర్ భావన పరిశీలించారు. పీపీపీ పద్ధతిలో సుమారు రూ.20 కోట్లతో ఏర్పాటు చేయబోయే ఈ ప్లాంట్‌కు సంబంధించిన వివరాలను ఎనర్గాన్‌లాజిస్టిక్స్ హైదరాబాద్ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. బయోగ్యాస్‌ను ఎలా ఉత్పత్తి చేయబోయేది చూపించారు. నగరంలోని డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న తడి చెత్తను ప్రాసెసింగ్ చేసి, బయో గ్యాస్‌గా రూపొందిస్తారని కమిషనర్ తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుతో పాటు, నిర్వహణ బాధ్యతను ఎనర్గాన్‌లాజిస్టిక్స్ ప్రతినిధులే నిర్వర్తిస్తారన్నారు. దీని వల్ల నగరపాలక సంస్థకు ఆదాయం సమకూరుతుందని, చెత్త నుంచి సంపద సృష్టించినట్టు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఈ వెంకట్రావు, ఎనర్గాన్‌లాజిస్టిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు

వర్షంతో జన జీవనం అస్తవ్యస్తం

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలతో పాటు, స్థానిక బస్సు కాంప్లెక్స్ చెరువుగా మారింది. జన జీవనం స్తంభించింది. స్టేషన్ సెంటర్, ప్రెసిడెంట్‌గారి వీధి, అయోధ్య రామపురం, రథం సెంటర్, సంపెంగ తోట, భాస్కర్‌నగర్, సాయినగర్, ప్రసన్నాంజనేయ నగర్, బ్రౌన్‌పేట, సీతారామ కాలనీ చెరువులను తలపించాయి. ప్రధాన డ్రైన్లలో పూడికలు తొలగించడంతో, పూడిక మట్టి అడ్డుపడి, వర్షపు నీరు పోయే అవకాశం లేకపోవడంతో రోడ్లు చెరువులుగా మారాయి. ఇప్పటికే రెండు సార్లు నష్టపోయిన రైతులు పొలాల్లోకి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు.



చెరువుగా మారిన సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో షిరిడీ సాయిబాబా ఆలయం రోడ్డు



ప్రెసిడెంట్‌గారి వీధిలో నిలిచిన వర్షపు నీరు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చంద్రకళకు చెక్కును అందజేస్తున్న సతీష్

కాకినాడ క్రైం: అగ్ని ప్రమాదానికి గురై, ఆసుపత్రి పాలైన ఓ బాధిత కుటుంబానికి శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతనిచ్చింది. కొద్ది రోజుల క్రితం కాకినాడ డెయిరీ ఫారం సెంటర్‌లో నివాసం ఉంటున్న చంద్రకళ అనే మహిళ ఇంట్లో దీపారాధన మంటలు అంటుకోవడంతో అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆమెకు కాలు కాలిపోగా, 11 ఏళ్ల కుమార్తె ఐశ్వర్య తీవ్ర గాయాలతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. నిరుపేద కుటుంబ పరిస్థితిని గుర్తించిన సతీష్ శ్రీయువసేన తరఫున ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో బాధిత మహిళ చంద్రకళకు బుధవారం కాకినాడలోని గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో రూ.25 వేల చెక్కును అందజేశారు. యానాంకు చెందిన కనకాల రాజు, బీ స్ట్రాంగ్ జిమ్ అధినేత సంకీర్త్ రాజు, పవన్ దాతల సహకారంతో పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించామని సతీష్ తెలిపారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వచ్చే సమయం	వెళ్లే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

బాలు పాటలు చిరస్మరణీయం



ఎస్పీ బాలుకు నివాళులర్పిస్తున్న కళా వేదిక సభ్యులు

బోట్‌క్లబ్: దివంగత సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం భౌతికంగా లేకున్నా, ఆయన పాడిన పాటలు చిరస్థాయిగా జన హృదయాల్లో నిలిచిపోయాయని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డొక్కుబుర్ర రామరాజు అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో బుధవారం కళావేదిక ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళావేదిక ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక ట్రెజరర్ సాల్మన్‌రాజు, సభ్యులు తిరుమలరావు, రామారావు, బద్రి, ప్రసాద్‌రెడ్డి, మహేశ్వరి, గణేష్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.